


ఆ వీధి పేరు మొదట్లో 'పడమటి వీధి'ట. జగదాంబ ఆ వీధిలోకి కాపురం వచ్చిన అయిదారేళ్ళకి జనం అసలు పేరు మరచి పోయారు. అంతా 'జగదాంబ వీధి' అని పిలవడమే అలవాటయింది. ఇవి నే విన్నసంగతిలెండి. ఆవిడని అంటే జగదాంబని ఆరేళ్ళబట్టీ చూస్తున్నాను. మావారికి వూరు బదిలీ అయి వచ్చిన దగ్గర్నుంచి ఈ వీధిలోనే వుంటున్నాం. జగదాంబ శాంతంగా వుండగా, సౌమ్యంగా మాట్లాడగా, సన్నగా నవ్వగా నే నేనాడూ చూడలేదు. చూడాలని కోరికగా వుండేది కొన్నాళ్ళు. కాని ఇప్పుడిప్పుడు ఆవిడకి ఆ గయ్యాళితనమే తప్ప, 'సౌమ్యత' అనేది ఆమె స్వభావానికి ఆపాదించడం, వూహలో కూడా కష్టసాధ్యమనిపించింది. బెదురు చూపులతో, ఛెంగుఛెంగున గెంతుతూ,


బెహరా సాహితి

మహాచురుగ్గా గజరాజుని వూహించకోగలమా? దాని ఉన్నతమైన శరీరం, మందయానం, ఠీవి. . యివన్నీ దానికమరిన లక్షణాలు. ఇందులో ఏం లోపం కనిపించినా "అబ్బే! ఏనుగా యిదా. "అంటూ చప్పరించేస్తాం.

'పులి' అనగానే భయంలాంటిది కలిగినా, అది బేలచూపులు చూస్తూ, మనం రొట్టె ముక్క విసిర్తే పిల్లిలా వచ్చి కరుచుకు పారి పోతే భరించగలమా?

ప్రపంచంలో మనం చనువుగా చేరరానివీ, మనకి భయం కలిగించేవీ కొన్ని వున్నాయి. అంతమాత్రం చేత వాటిని అసహ్యించుకోము. పైగా వాటిలో వుండే ఒకానొక విలక్షణ మైన సౌందర్యమనండి, మరేదో ఆకర్షణ నండి మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది అలాగే జగదాంబకా చండిక వేషమేగాని, సీతమ్మ వారిలా వుంటే ఆవిడ సంగతి ఎవరికీ అక్కర లేకపోను. ఐతే జగదాంబ ఆకారం భీకరం కాదు. పుష్టిగా, కాస్త పొట్టిగా వుంటుంది. పచ్చని ఛాయ, గుండ్రటి మొహంతో విశా లంగా వున్న కళ్ళు చూస్తే, 'ఎంత అందం?' అని అనిపించదు జనానికి. చూపుల్లో కోపం, ఎదుటివారిపట్ల క్రోధం, అసహనం మొదలైన భావాలే ఎప్పుడూ తారట్లాడు తుంటాయి కనుక, చటుక్కున "అబ్బ! ఏం కళ్ళురా బాబూ! అమ్మవారిలా! గుడ్లురిమి చూసిందంటే పిల్లలు జడుసుకోవాలి." అంటూ చుట్టుపక్కల యిల్లాళ్ళు మెటికలు విరవడం కద్దు. జగదాంబ గురించి ఎరగనివారు ఆవిడని చూసిన మొదటి క్షణంతోనే 'అందమైన మనిషే' అనుకోక మానరు. కాని ఆవిడ నోరు ఎరిగున్న వూరివూరంతా ఒకటే చెప్తారు (ఎవరైనా జగదాంబ 'ఎలావుంటుంద'ని అడిగితే).

"అబ్బో! ఆవిడా! రాక్షసిలెండి. మహిషా ఆ వుంటుంది పొట్టిగా, లావుగా, గుమ్మటం లాగా. ఎంతెంత కళ్ళనుకున్నారు. చూస్తేనే భయం" అని. ఆవిడ స్వభావంలోని కరుకు దనంవల్ల ఆవిడ అందం ప్రజల కళ్ళముందు భీకరమైపోయింది. అదీ నిజమేలెండి, సోక్ర టీస్ భార్య, (ఆవిడ పేరేమిటోగాని .) చండిక. యిలాంటి ఆడవాళ్లు అందంగా, చలాకీగా, సొగసుగా మెరపుతీగల్లా మిలమిల లాడుతూ వుంటారని ఎవరేనా చెప్తే, నమ్మా లనిపిస్తుందంటారా?

జగదాంబ రూపురేఖ లెలావున్నా, ఆవిడ కంఠం మాత్రం మైకు లేకపోతే మూడు వీధులకీ, వుంటే ముప్పై వీధులకీ వినిపి స్తుంది. మాయింటి ప్రక్కనే వుంటున్న సంగీతం మాష్టారంటూ వుంటారు. పొద్దున్నే కుళాయిదగ్గర జగదాంబ కంఠం వినబడటం తోనే, "అదిగో జగజ్జనని 'కదన కుతూ హలం' ఆరంభం చేసింది," అని.

"భగీరథుడు గంగని తెచ్చాట్ట. ఏదీ ఈ మునిసిపాలిటీ కొళాయిలోంచి మూడు చుక్కలు నీళ్లు తెప్పించమనండి చూద్దాం," అంటూ జగదాంబ భగీరథుడ్ని సవాలు చేస్తుంది.

"చుక్కమ్మ కోడలు నూతిలో పడిందిట" ఎవరో అంటారు పక్కనే. రభీమని జగ దాంబ అంటుంది. "నుయ్యి పాడెట్టడానికి కాకపోతే ఎందుకా దౌర్భాగ్య ప్పనులు," అని.

"నిన్నట్నుంచి మా రవిగాడికి జ్వరం వదినా" అని పక్కింటిల్లాలు సానుభూతి నాశిస్తూ చెప్తుంది.

"ఔనూ గారం పేరు చెప్పి అడ్డమైనవీ పెట్టేస్తే పిల్లాడికి అరగొద్దూ,"

పక్కింటామె కష్టపెట్టుకునో, కోపం తెచ్చుకునో "అదేమిటొదినా అలా మాట్లాడ తావు," అనేసరికి మూతి మూడువంకరలు త్రిప్పి, చేతులు ఝాడిస్తూ, "బాగుందమ్మోయ్ నేనేం తప్పు మాటనలేదు. పిల్లవాడిగురించే బాధతో అన్నాను. ఐనా నాకెందుకు. ఉన్న మాటంటే ఉలుకని " సాగదీస్తూ వెళ్ళి పోతుంది.

మేమీవూరు వచ్చిన కొత్తలో, మా అమ్మ వచ్చింది. జగదాంబ యింటికి వెళ్ళాం నలు

గుర్నీ పరిచయం చేసుకునే వుద్దేశ్యంతో. జగదాంబ అద్దెకుంటున్న వాటాతోకలిపి ఆ యింట్లో ఆరు వాటాలున్నాయి. ఆ యింటిని అన్ని భాగాలుగా విభజించిన యింటి యజమాని యొక్క సూక్ష్మబుద్ధిని, తెలివితేటల్నీ మెచ్చుకోకుండా వుండలేం. అంతా మధ్యతరగతి గాళ్ళు. వారందరికీ ఓ విధంగా జగదాంబ రాణీ.

"ఎమిటండీ! ఒక్కటే బాత్‌రూమా అందరికీ?" అమ్మ ఆశ్చర్యంగా అడిగింది. నేనూ "పైపుకూడా ఒక్కటే వుంది." అన్నా. జగదాంబ, మాకు యిల్లు చూపిస్తున్నదల్లా తక్కున ఆగి, కొంగుదులిపి, మళ్ళీ నడుమున దోపుతూ, "ఔనమ్మా! ఏంచెప్పమంటారీ యింటి వరస! మొగుళ్ళు తప్ప అంతా ఉమ్మడే ఇక్కడ," అంది పెద్దగా.

అదిగో అలా వుండేది ఆవిడ మాట తీరు. 'వుండేది' అని ఎందుకంటున్నానంటే ఇప్పుడు ఆవిడ తీరుచూసి, నిర్ఘాంతపోని నరమానవులు లేరు. ఈ విషయం చెప్పేముందు ఆవిడ భర్తగురించి కొంత చెప్పాలి.

అతని పేరు ముకుందం. వడలిన పొట్లకాయలా వుంటాడు. కళ్లు చూస్తే, పరిశీలనగా, ఉలిక్కిపడతాం. పిల్లలకి 'పులి-బంగారు కంకణం' కథ చెప్తాం చూడండి! అదిగో అందులోని పులి స్వభావం అనిపిస్తుంది. ఏదో శక్తి అతనిలోని క్రూరత్వాన్ని అణచిపెడుతోంది గాని లేకపోతేనే 'ఎంతకైనా తగును' అన్నట్లుంటుంది వాలకం! కాని, జగదాంబ ముందు పిల్లి! ముఖంలో దైన్యం, నీరసం అప్పటప్పుడు వైరాగ్యం తొంగిచూస్తుంటాయి. లోకులు "పాపం జగదాంబ మొగుడు" అనుకుంటారు. కాని వీటన్నిటివెనుక అతనిలోని కపటం తొంగిచూస్తూనే వుంటుంది. సాయంత్రమయేసరికి వీధి అరుగుమీద చతికిలబడి, ఆకాశంలోకి చూపుల్ని నిగిడ్చి శక్తి, యుక్తులు కోల్పోయిన మాంత్రికుడిలా కూచుంటాడు. ఆఫీసునుండి వచ్చేసరికి పిల్లల 'ముఖారి' రాగాలాపన తారస్థాయిలో వుంటుంది. అతనికో గ్లాసు చల్లటి కాఫీ యిస్తూ, అందుకుంటుంది జగదాంబ.

"పెద్దాడికి నోట్‌బుక్ కొనివ్వలేదుట. స్కూల్లో తిట్లు తిన్నాట్ట యివాళ, ఇంకోటి బోడి ఆఫీసుకీ ఆలస్యమవుతుందనే వాడికో పుస్తకం కొనివ్వకుండా పరిగెట్టారు?"

"నాకూ జామెట్రీబాక్స్ కొనాలమ్మా! ఎన్నాళ్లు ముష్టి అడుక్కోడం. ఎప్పుడు కొంటాడో అడుగు." రెండోవాడు బిళ్ళంగోడు చేత్తో పట్టుకుని, పరుగున వస్తాడు. వాడికళ్లలో తండ్రిపట్ల తనకి వస్తువు కొనలేదన్న కోపం కన్న, నిర్లక్ష్యం, హేళన ఎక్కువ కనిపిస్తాయి. తల్లి, తండ్రి అసమర్ధతని రకరకాలుగా గానం చేస్తుంటే పిల్లలిద్దరూ యధాశక్తి, పక్కవాద్యగాళ్ళలా కచేరీ రక్తి కట్టిస్తారు. చుట్టుపక్కల ఇళ్ళవారికీ అప్పుడప్పుడిది వినోదంకలిగించినా, వారిలో యింక ఆ రసాస్వాదనాసక్తి మిగిలి లేదు. జగదాంబ ఇంట గెలిచి, రచ్చకెక్కింది.

నాతో ఎక్కువగా ఎప్పుడూ మాటాడలేదావిడ. ఎవరితోనో అనగా, తెలిసింది నాకు. "కృష్ణవేణిది ముభావం. చదువుకున్నదని గర్వం కాబోసు" అని. నిజం చెప్పొద్దూ! అంతటితో వూరుకున్నందుకు నాకు సంతోషమే కలిగింది. ఎందుకంటే యేదో ఓ సందర్భంగా ఆవిడచేత ఘాటుగా విమర్శింపబడనివాళ్ళు ఆ వూరి మొత్తంలో లేరు. సాధారణంగా అందరూ గయ్యాళితనానికి ఉదాహరణంగా ఏ 'చండిక' అనో, సినిమా 'సూర్యకాంత'మనో అంటూ వుంటారు. కాని ఆ వూరివాళ్ళుమాత్రం 'జగ-దాంబ'ని ఉదహరిస్తూ వుంటారు. అంతెందుకు, నే కాస్త గట్టిగా మాట్లాడినా, కసిరినా మావారు "జగదాంబగారి గాలి సోకిందా ఏమిటీ?"అంటూ వుంటారు.

ఇంత పేరు (మంచిదో, చెడ్డదో) సంపాదించుకున్న ఆవిడమీద నాకుమాత్రం ఎందుకో జాలిగా వుంటుంది. భర్తకి సుఖమివ్వలేదు. చుట్టుపక్కలవారితో సఖ్యతలేదు. పిల్లలలోనూ ఓ క్రమశిక్షణలేదు. కేవలం నోరు పెట్టుకు నెగ్గుతున్న యీ మనిషికి సుఖమనేది

వుంటుందా అనిపిస్తూ వుంటుంది. ఏ పరిస్థితుల వల్ల, ఏ అసంతృప్తివల్ల 'జగదాంబ యిలా తయారయిందో' అని వూహించడానికి ప్రయత్నించేను. ఏదో సందర్భంలో మావారిదగ్గరన్నాను. "ఆవిడని అర్థంచేసుకోడానికి ఎవరూ ప్రయత్నించలేదేమో! ప్రతివారూ ఆవిడ నోటికి భయపడి దూరంగానే మసలుతారు" అని మా వారు నవ్వుతూ "ఆ అర్థంచేసుకోడమనే పని నువ్వుమాత్రం చెయ్యకు సుమా! యెందుకూ సుఖాన్ని వున్న ప్రాణాన్ని కష్టాన్న పెట్టుకుంటావు?" అని వేళాకోళం చేసారు. కాని కొద్దో, గొప్పో ఆ అవకాశం మా బాబాయ్ రాకవల్ల వచ్చింది.

బాబాయ్ ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరు. కొద్ది రోజుల్లోనే రిటైరవబోతున్నాడు. నేనంటే ప్రాణం. అన్నగారి కూతురనేగాక, తనకి ఆడపిల్లలు లేకపోవడం మూలాన అనుకుంటాను. నాకు బాబాయ్ దగ్గర చనువు, గారమూను. ఆరేళ్ళకి నన్ను చూడ్డానికొచ్చారని కోపగించేను బాబాయ్ వచ్చీ రావడంతోనే.

"కృష్ణా! చిన్నతనం పోలేదు సుమా నీకు! వద్దామనుకుంటూనే అలా గడిచిపోయింది. ఆ నార్త్‌కింక శాశ్వతంగా గుడ్‌బై చెప్పేశాను. ఇక రిటైరయ్యేదాకా మనవైపే నా ఉద్యోగం. అంతేకాదు. మీ యింటిపక్కనే యిల్లు కొని ఇక్కడే వుండిపోతాను." ఈ వార్త నాకు ఆశ్చర్యంగా అనిపించింది.

"అదేమిటి బాబాయ్! ఈ వూళ్ళో యిల్లు కొంటావా? ఇంకేవూరూ నచ్చలేదూ?"

"దీనికేం లోపమొచ్చింది చెప్పు. గాలీ, నీరూ మంచి ఆరోగ్యప్రదంగా వుంటాయి. మనవాళ్ళందరికీ దగ్గర. ముఖ్యంగా నీకు.. " అంటూ ఆగాడు.

"ఆ! మాకు బదిలీ అయి .." అంటూ వుండగానే

"అవనివ్వనుగా"అంటూ నవ్వాడు బాబాయ్. బాబాయ్‌కున్న పలుకుబడి చాలా గొప్పదే. ఆ విషయంలో సందేహంలేదు. అసలు బాబాయ్, అందం, ఐశ్వర్యం, హోదా అన్నీ కలిసిన అదృష్టవంతుడు. బాబాయ్‌ని తల్చుకుని గర్వపడుతుంటానుకూడా అప్పుడప్పుడు.

ఇంతకీ బాబాయ్ కొనదలచుకున్న యిల్లు జగదాంబ వుంటున్న యింటి ప్రక్కయిల్లే. అన్నీ సెటిల్ చేసుకోడం, గృహప్రవేశానికి ముహూర్తం నిర్ణయించడం కూడా జరిగిపోయాయి. "కొత్తగా కట్టిన యిల్లయితే బాగుండును' అంటూ పిన్ని సణిగినా, యిల్లు చూశాక తృప్తిపడింది. కట్టి ఆట్టే కాలం కాలేదు. కొత్తగానే వుంది.

గృహప్రవేశం రోజు శ్రీవారు, పిల్లలతో సహా బాబాయిగారి కొత్త యింట్లో సందడిగా గడిచింది. మాటల్లో అన్నాను "బాబాయ్! మీకు నిత్యం సందడే అనుకో. మేలుకొలుపు యిక పిన్ని పాడక్కరలేదు నీకు. మున్సిపాలటీ కుళాయి దగ్గర జగదాంబ కంఠమే ఈ వీధిలో అందరికీ మేలుకొలుపు పాడేస్తుంది. మీకు మరీ పక్కయిల్లేనేమో, జగదాంబ పుణ్యమా అని రేడియో పెట్టుకునే అవసరం కూడా వుండదు మీకు" అని.

"అంత చిన్న కంఠమా బాబూ?" పిన్ని అడిగింది నవ్వుతూ.

"మరేమనుకున్నావ్! నువ్వు జాగ్రత్తగా వుండాలి పిన్నీ. మీ యింటిమీది కాకి వాళ్ళింటిమీద వాలినందుకూడా జగడం పెట్టెయ్యగలదు తల్చుకుంటే. నీకు తెలిసిన సంగతైనా సరే, "ఇదెలా చెయ్యాలి వదినా, నిన్ను అడిగి తెల్సుకోవాలని వచ్చాను" అంటూ వినయం చూపిస్తే చాలు, జగదాంబ క్షణంలో ప్రసన్నమైపోతుంది' అక్కడే వున్న బాబాయి కల్పించుకుంటూ, "అమ్మాయ్! ఏ మనిషి యొక్క మంచి చెడ్డలూ కూడా బాహ్యప్రవర్తనని పట్టి నిర్ణయించలేం. ముఖ్యంగా ఇలాంటివారున్నారే, వాళ్ళని యే పరిస్థితులో, ఇలా మార్చివుంటాయి. కొంత అవగాహన చేసుకుందుకు ప్రయత్నించి చూస్తే, మనకి దారి దొరుకుతుంది. దేనికైనా సానుభూతి అనేది కొంత అవసరమమ్మా!" అన్నాడు. ఈ మాటలని, ఎందుకో నిట్టూర్చాడు. బాబాయ్ కంఠంలో

మార్పు చెవులకి సోకి ఆశ్చర్యంగా చూశాను. కొద్దిగా మ్లానమైంది ముఖం.


ఆ రోజు రాత్రి అక్కడే వుండిపోయాం. తూర్పువేపు గదిలో పక్కలు వేయించింది పిన్ని. జగదాంబ వుంటున్న యింటికి, బాబాయ్ యింటికీ గోడ మాత్రమే అడ్డం. అవతల వాళ్ళ పెరడు కనిపిస్తూ వుంది గది కిటికీలోంచి చూస్తుంటే. జగదాంబ ఇంటి పెరట్లో ఓపక్క నీళ్ళ పంపు, దానిపక్కనే ఓ బాత్‌రూమూ, రేకులతో కట్టిన మరో షెడ్డూ వున్నాయి. పెరట్లో అటు, ఇటూ మందార మొక్కలు, మధ్యగా పెద్ద తులసికోట, జగదాంబ వాటాలో తలుపుకి దగ్గరగా వుంది. కిటికీ ప్రక్కగా మంచం వేయించుకున్నాను నేను. వెన్నెల కిటికీలోంచి చల్లగా ప్రవేశిస్తోంది. ఆ గది విశాలంగా వుండటం మూలాన అందరికీ అక్కడే పక్కలమర్చింది పిన్ని. కబుర్లు చెప్పుకుంటూ, అలాగే నిద్రలోకి జారాం అందరం.

చటుక్కున ఎందుకో మెలకువ వచ్చింది నాకు. అంతా నిశ్శబ్దం. పౌర్ణమి కాబోలు, చంద్రుడు ఫకాలున నవ్వుతున్నాడు వెలుగుల్ని వెదజల్లుతూ. ఏదో పిట్ట రెక్కలు టప టప లాడించిన చప్పుడు, వెన్నెల సరసులోస్నానం చేస్తూ, పిల్లగాలి తగిలి చలికి రవంత వణికినట్లు ఆకులు కదిలాయి. ఎంత చల్లగా వుంది. ఈ నిశ్శబ్దంలో, పుచ్చపువ్వులాంటి ఈ వెన్నెల ఆహ్లాయంగా నన్ను చుట్టుకుని, మెత్తగా ఏదో చెప్పబోతున్నట్లుగా వుంది. కొద్దిగా తలెత్తి, మేఘంలో సగం దాక్కున చంద్రుడ్ని చూడబోయాను. అంతలోనే ఉలిక్కిపడ్డాను. పక్క పెరట్లో, తులసికోట దగ్గర ఎవరదీ? కుతూహలంగా చూశాను పరికించి. ఇంకెవరూ? జగదాంబ. తులసికోటకి జేరగిలబడి, కిందనున్న సిమెంటు చప్టామీద చతికిలబడి, కూర్చుని వుంది. ఆశ్చర్యంతో అలాగే చూస్తుండిపోయాను కాసేపు. ఇదేమిటీ? ఈ టైములో ఇలా కూర్చుంది? తలగడమీద మోచేయి ఆన్చి, అరచేతిలో తలపెట్టుకుని అటు తిరిగి ఆవిడనే పరిశీలనగా చూడ్డం మొదలుపెట్టాను.

"ఇంట్లో మొగుడిమీద అలిగి రాలేదు కదా పెరట్లోకి?" అని, నవ్వుకున్నాను. వెన్నెల్లో స్పష్టంగా కన్పిస్తోంది. తల కొద్దిగా వెనక్కి వాల్చిందావిడ తులసికోటకి. అంతే! ఆ క్షణమే ఆ దృశ్యమే నాకావిడమీద అంతకుముందున్న అభిప్రాయాన్ని మార్చేసింది. అంతేకాదు, బాబాయ్ మధ్యాహ్నం చెప్పిన మాట నా మనసులో మెదిలింది. ఆవిడ కళ్ళలో ఎంత వేదన! ఎంత బాధ! ముఖమంతా దైన్యం అలుముకుంది. ఆ కూర్చున్న తీరులో ఎంత నిస్పృహ, నిర్జీవత్వం! సర్వం పోగొట్టుకున్నదానిలా, అప్పుడే ఆత్మీయుల్ని శాశ్వతంగా సాగనంపినట్లుగా, ప్రపంచమంతా తన్ను నిస్సహాయను చేసి పరిహసిస్తున్నట్లుగా... అబ్బ! ఆ కూర్చున్న తీరు, ముఖ కవళికలు, ఆకాశంలోకి ఆ చూపులు . . .ఎంత దీనంగా కన్పడిందనుకున్నారు!! జగదాంబేనా అంటూ విస్తుపోయాను. ఒంటరిగా, పెరట్లో నిస్తేజంగా, నిర్వేదంగా అలా కూర్చున్న ఆవిడని చూస్తే, అకస్మాత్తుగా జాలిలాంటిది పొంగివచ్చింది నాలో. ఆవిడ యీ లోకంలో వున్నట్టు లేదు. "ఎండబెట్టుకున్న వడియాలమీద మట్టి పోశాడని సాయంత్రం పక్కింటి పిల్లవాడిమీద, అతనితల్లి మీద ఉరుములు,పిడుగులతో తిట్లవర్షం కురిపించిన మనిషేనా ఈవిడ" అనిపించింది. మబ్బులు కమ్మిన ఆకాశంలా వుందిప్పుడు. ఇన్నాళ్ళూ నే చూసిన జగదాంబ వేరు. ఈవిడ వేరు అనిపించింది. అలా యెంతసేపు నేనా కిటికీలోంచి ఆవిడని పరికిస్తున్నానో నాకేతెలియలేదు. ఆవిడలో మాత్రం చలనంలేదు. విషాదం మానవరూపంలో గడ్డకట్టినట్టు అలాగే కూర్చుంది. నా తలదగ్గర అలికిడి అయితే చూశాను ఉలిక్కిపడి. ఎప్పుడు వచ్చాడో, మంచందగ్గిర నిలబడి, కిటికీలోంచి అటే చూస్తున్నాడు బాబాయ్, చేతులు కిటికీ రెక్క మీద ఆన్చి, కొద్దిగా వంగి.

"ఏం కావాలి బాబాయ్?" లేస్తూ అన్నాను.

"ఉష్!" గట్టిగా మాట్లాడవద్దని సౌజ్ఞ చేస్తూ అన్నాడు.



వింతగా చూశాను. గొంతు తగ్గించి "మంచినీళ్ళు పెట్టలేదా పిన్ని" అన్నాను. నా గొంతు నాకే విచిత్రంగా విన్పించింది. చప్పుడు కాకుండా నవ్వాడు బాబాయ్. ముందుకువచ్చి మంచంమీద తలగడవేపుకూర్చుంటూ అన్నాడు "నువ్వు లేచావేం?"

"ఎందుకో చటుక్కున మెలకువ వచ్చింది. అలా చూసేసరికి.. " అంటూ ఆగాను.

తల పంకించాడు బాబాయ్. అయోమయంగా వుంది నాకు. లేచి, సర్దుకుని మంచం మీద కూర్చుంటూ అడిగాను.

"ఏమిటి బాబాయ్!"

బాబాయ్ ఓసారి గదంతా కలియజూశాడు. అంతా గాఢనిద్రలో వున్నారు.

"టైమెంతయిందో?" మళ్ళీ నేనే అన్నాను.

"పన్నెండవుతోంది." నెమ్మదిగా అన్నాడు బాబాయ్.

చూపంతా జగదాంబవేపే వుంది. నేను నివ్వెరపోయి చూస్తున్నాను. ఓ పదినిముషాలలా నిశ్శబ్దంగా గడిచాయి. చటుక్కున బాబాయ్ లేచి "పడుకోమ్మా వూరికే మెలకువ వచ్చి ..యిలా....వచ్చాను." నెమ్మదిగా నడిచి తన మంచంకేసి వెళ్ళిపోయాడు. ఏనాడు బాబాయ్‌ని అటువంటి మూడ్‌లో చూడని నేను ఆశ్చర్యంతో స్థాణువులా వుండిపోయాను. కొంతసేపటికి జగదాంబ లేచి చరచరా తన వాటాకేసి నడవడం చూశాను.

* * *

"బాబాయ్!"

సాయంత్రం డాబామీద అటూ ఇటూ పచార్లు చేస్తున్న బాబాయ్‌ని సమీపించాను కాఫీ గ్లాసుతో.

"ఏమిటమ్మా?"

చుట్టూచూసి, ఓసారి మెట్లవేపు చూసాను ఎవరేనా వస్తున్నారేమోనని. ఎవరూ లేరు.

"నీదగ్గర నాకు నాన్నకంటెకూడా చనువెక్కువ. కదా!"

"కాదనీ అన్నానా?" కాఫీ గ్లాసు అంచుల మీంచి చూస్తూ నవ్వాడు బాబాయ్.

"నీ నవ్వుకూడా తేడాగా వుంది బాబాయ్."

"అలాగా!"

"నువ్వలా అంటే ముంటనట్లుంటే నే

నొప్పుకోను. చెప్పు! రాత్రి .... రాత్రి.... నువ్వు... " ఏమనాలో తెలియక ఆగాను.

బాబాయ్ గలగలా నవ్వాడు. "అమ్మాయీ నీకు సందేహం కలిగిందంటే వూరుకోవు. నాకు తెలుసు," అని ఆగి ఎటో చూస్తూ అన్నాడు. "ఈ విషయం ఒకరికి చెప్తానని నేను అనుకోలేదు. పోనీ.. ఈ చిట్టితల్లిదగ్గర దాచాలని కోవటంలేదు. సరేగాని మీ పిన్నికి చెప్పవుగదా!" అంటూ కొంటెగా చూశాడు. నవ్వేశాను నేను.

బాబాయ్ చేతిలోంచి కాఫీ గ్లాసు తీసుకుని కిందపెట్టి పిట్టగోడ నానుకుని నిలబడ్డాను. బాబాయ్ అటు ఇటూ మరికొంతసేపు పచార్లు చేశాడు మౌనంగా. ఆ తర్వాత దీర్ఘంగా నిట్టూర్చి, అక్కడేవున్న పడక కుర్చీలో కూచుంటూ అన్నాడు.

"జగదాంబ, నాకు పక్కింటమ్మాయి చిన్నప్పుడు."

"ఆ!"

"ఔను. నర్సాపురంలోనే వాళ్ళ పుట్టిల్లు."

"మన వూరేనన్నమాట!!"

బాబాయ్ ఓ క్షణం మళ్ళీ మౌనంగా వుండి, తర్వాత తలెత్తి నాకేసి చూస్తూ "పక్కింటమ్మాయితో ప్రేమలో పడ్డం యువకులకి సహజం....నువ్వు...కథల్లో అప్పుడప్పుడు చదివే వుంటావు." ఈ మాటలంటూ బలవంతంగా నవ్వాడు. ముఖంలో కాంతి మందగించింది. ఒక్క క్షణంలో నాకంతా అర్థమయినట్టనిపించి, నాకు తెలియకుండానే, బాబాయ్ భగ్నప్రేమ వ్యధ ముల్లులా బాధించింది. కొంతసేపు నేనూ ఏమీ నోరు మెదపలేక పోయాను. బాబాయ్ ముఖ కవళికలే అందుకు కారణం.

గయ్యాళీ, రాకాసి అని బిరుదులు పొందిన, యీ మధ్యతరగతి మహిళ, సాదా నేతచీరలో, అతి సామాన్యమైన అలంకరణలో, ఏ ప్రత్యేకతా కనిపించని జగదాంబ నా బాబాయ్‌కి ఒకప్పటి ప్రియురాలా!! నమ్మశక్యంగా లేదు!

"జగదాంబ కళ్లు చూశావా?" బాబాయ్ ప్రశ్న.

"ఊఁ! చాలా అందమైనవి" అప్రయత్నంగా అన్నాను.

"రంగు?"

"పచ్చని ఛాయ!"

"చిన్నప్పుడెలా వుండేదో తెలుసా?"

"ఎలా?"

"బంగారు బొమ్మలా. మాటతీరు.. వినిపించనంత మృదువు."

అవాక్కయి చూస్తున్నాను. బాబాయ్ తనలో తనే చెప్పుకుంటున్నట్లుగా మాట్లాడుతున్నాడు.

"పాపం! అమాయిక. మూడో ఏటనే సవతి తల్లి ద్వేషాన్ని రుచిచూసింది. అప్పట్నుంచి, యీ స్కౌండ్రల్ ముకుందానికి ముడివేసేదాకా ఆవిడ ద్వేషాన్నే గుమ్మరించింది జగదాంబమీద. ఒక్కర్తే కూతురు. సవతి తల్లికి మళ్ళీ పిల్లలు లేరు. నాలుగు ఎకరాల ఆస్తి. అది వృథాగా మరెవరికో పోకూడదని, తన తమ్ముడు....అ ముకుందానికే బలవంతాన కట్టబెట్టింది. జగదాంబ తండ్రి నోరులేనివాడు. ఆ పోలికే కూతురికొచ్చింది."

చివరి మాట విని నాకు నవ్వొచ్చింది. బాబాయ్ అది గ్రహించి, తనూ నవ్వేశాడు, "కాని అమ్మాయ్, చూడు, మనుషులు ఎంత నీచానికి పాల్పడగలరో డబ్బు విషయంలోనే సుమా మరి. . యింక....దాని కంతులేదు. జగదాంబని, ముకుందాన్ని వంటరిగా యింట్లో వదిలి, వూళ్ళో గుడికి వెళ్ళొచ్చిన ఆ సవతి తల్లి, తన ఆడతనం, మనసు, మమత అన్నీ మరిచిందావేళ. చుట్టుపక్కలవాళ్ళకి వినిపించేలా జగదాంబని తిట్టడం, అరవడం, మధ్య మధ్య రాగాలు. నాటకమంతా మంచి పేరుమోసిన నటిలా సాగించింది."

"ఏం నాటకం?" ఆసక్తి నాలో పెరిగి పోతోంది.

"ఏం వుంది. తను వంటరిగా ఇద్దర్నీ ఇంట్లో వదిలి వెళ్తే, చెయ్యకూడని పనే చేశారుట తమ్ముడూ, సవతి కూతురూను.

"నీ తండ్రి వేరే సంబంధాలు చూస్తుంటే . నా తమ్ముడిమీద అంత మనసున్నదానివి .. ముందే చెప్పరాదా? ఈ వెధవ్వేషాలెందుకే?" అంటూ కేకలు. చుట్టుపక్కల యిల్లాళ్ళు బుగ్గలు నొక్కుకుని, ఆ తర్వాత "వరసే కదా! ముడెట్టండి." అన్నారు ఏకగ్రీవంగా. ముకుందం కిక్కురమనకుండా తలవంచుకుని, లోలోన బ్రహ్మానంద మనభవిస్తూ నటనలో అక్కగార్ని మించిపోయాడు. నిప్పు లేకుండానే పొగ పుట్టించగల శక్తి కొందరి కుందని జగదాంబ తండ్రి వూహించలేకపోయాడు. అంతవరకు కళ్ళలోనే దాచుకున్న ప్రేమని, మరి భరించలేక, జగదాంబ ఓనాడు, పెదవి విప్పి నాముందు పరిచింది. అదే మొదటి సారి, అదే చివరిసారి మేం మాట్లాడుకోడం" బాబాయ్ ముఖంలో చిరునవ్వు. ఊపిరి బిగపట్టి వింటున్నాను.

"ఆ ముకుందం వెధవకిచ్చి చేస్తారుట నన్ను?" కళ్ళెత్తి బేలగా చూస్తూ, "నువ్వేమంటావ్?" అన్నట్లు అడిగింది జగదాంబ.

"నీకిష్టంలేదా?" ఏం మాట్లాడాలో తెలియని కంగారూ, ఎవరేనా వచ్చి చూస్తారేమోనన్న బెదురూ నాకు.

"నాకా? వాడంటేనా?" జగదాంబ ముఖంలో ఏం కనిపిందనుకున్నావు? 'ఓ కత్తి దొరికితే, ఇప్పుడే వెళ్ళి వాడిని నిలువునా చీరనా' అన్నంత ఆవేశం కన్పించి ది.

"మరేం చేస్తావిప్పుడు? పెద్దవాళ్ళు. " అంటూ నీళ్ళు నమిలాను నేను. గుండెలో ఏదో వినిపిస్తోంది. కాని మన పెద్దల హుంకారాలు వూహించుకుని, నా గుండె పాడేది నేనే వినిపించుకోలేకపోయాను. నేనామాట అనగానే ఆ విశాలమైన కళ్ళెత్తి 'అంతేనా?' అన్నట్లు చూసింది.

"నువ్వేనా ధైర్యం చెయ్యలేదా బాబాయ్!" విస్మయ పడుతూ అడిగాను.

"ఆనాడు నీ బాబాయ్ పద్దెనిమిదేళ్ళవాడు. శాఖ వేరు, అంతస్తు వేరు అంటారనే తెలుసుకొని "ఐతే యేం?" అనడిగే ధైర్యం లేదు పైగా సవతి తల్లి సృష్టించిన అపవాదు ఒకటి."

బాబాయ్ పక్కన ముకుందాన్ని పోల్చుకుని, "ఎంత అదృష్టహీనురాలు" అనుకున్నాను జగదాంబని తల్చుకుని. బాబాయ్ మనసులో ఆనాటి బంగారు బొమ్మే సజీవంగా వుందన్నమాట!! తన నిస్సహాయత, తను ద్వేషించే ముకుందంతోనే జీవితం పంచుకోవలసి రావడం పాపం! జగదాంబ!

"దట్టంగా మబ్బులు ముసిరిన ఆకాశం జగదాంబ యిప్పుడు. ఉరుముతుంది. ఫెళ ఫెళలాడుతుంది. జనం నోళ్ళలో గయ్యాళి అయింది. సవతితల్లి క్రూరత్వం, ముకుందం వంచన అన్నీ ఆమె నిస్సహాయతని వేనోళ్ళ చెప్పేసరికి, తెలియకుండానే ఆమెలో కసి, కోపం బయలుదేరివుంటాయి. మార్దవం, లాలిత్యం, సౌమ్యత, శాంతం అన్నీ ఆమె దెబ్బతిన్న మనసులోంచి జారుకున్నాయి. కాని, కృష్ణా, ఓవిధంగా ఆమె ఏకాకి. సానుభూతి అనే చల్లనిగాలి సోకివుండదింతవరకూను. అదే జరిగివుంటే, ఆమె ఏనాడో వర్షించి, వర్షించి తన దుఃఖభారాన్ని తీర్చుకుని వుండేది" బాబాయ్ కళ్ళు చెమ్మగిల్లాయి.

* * *

జగదాంబ నాకిప్పుడు కొత్త రూపంలో కనిపిస్తుంది. ఇంతకుముందులా ఆవిడ్ని చూడలేకపోయేదాన్ని. పైగా మరో ముఖ్యమైన విషయం మీకు చెప్పాలి. బాబాయ్ని ఆవిడ మొదటిరోజే బాగా గుర్తుపట్టింది. ఆనాటి రాత్రి, ఆ నిశ్శబ్దంలో దీనాతిదీనంగా, తన తొలి ప్రేమ తలపులని తవ్వి తలకెత్తుకుని వుంటుంది. బాబాయ్ తన యింటి పక్కనే కాపురం రావడం ఆమెలో ఏ మార్పు కలిగించిందో నాకు తెలియదు గాని, వూరివారంతా మాత్రం నిర్ఘాంతపోయారు "జగదాంబ నోరు వినిపించటంలేదే" అని.

మా పక్కనున్న సంగీతం మాష్టారు ఆశ్చర్యంగా "జగదాంబ మౌనరాగం ఆలపిస్తున్నదేం చెప్మా!" అనేవారు.

జగదాంబ ఇప్పుడు పరమశాంతమూర్తి. □